క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ లక్ష్మీనరసయ్య

రామసముద్రం: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ లక్ష్మీనరసయ్య సూచించారు. గురువారం ఆయన రామసముద్రం, చెంబకూరు పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీలు చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి పరిశీలించారు. అలాగే ఓపీ, మందుల స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఓపీ పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరం నిర్వహించి, ప్రతి మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి గ్రస్తులు ఉంటే వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు ప్రత్యూష, జాహ్నవి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

నిమ్మనపల్లె : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని రెడ్డివారి పల్లె పంచాయతీ బురుజుమాదిగపల్లెలో వాటర్‌ట్యాంక్ క్లీనింగ్ కార్యక్రమాన్ని తనిఖీచేశారు. బండ్లపై గ్రామంలో ప్రజలకు చెత్తసేకరణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రీన్ అంబాసిడర్లకు సహకరించాలన్నారు. తడి, పొడిచెత్తలను వేర్వేరుగా నిల్వచేసి అందించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ఉదయం 6 నుంచి 8 వరకు తప్పనిసరిగా విధుల్లో పాల్గొని సేకరించిన చెత్త డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

ములకలచెరువు: అదుపుతప్పి టమాటా లారీ బోల్తా పడిన సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ములకలచెరువు నుంచి జబల్‌పూర్‌కు వెళ్తున్న టమాటా లారీ బత్తలాపురం క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత



రేషన్‌కార్డులు డీలర్లకు అందిస్తున్న తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె రూరల్ : మండలంలోని రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి రేషన్‌డీలర్లకు అందజేశారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ఫిరోజ్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్‌కార్డులను షాపులవారీగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్బన్, రూరల్ పరిధిలోని 101 షాపులకు 62, 983 స్మార్ట్‌కార్డులు అందజేశామన్నారు. కొత్త స్మార్ట్ కార్డులను సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి అందజేస్తారని తెలిపారు. స్మార్ట్ కార్డులతో రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఖాసిం, మౌలా, రాజు, సుధీర్‌బాబు, కృష్ణమూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు

మదనపల్లె సిటీ: జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ నెల 15వతేదీ వరకు జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి వేగంగా సంక్రమించే ప్రాణాంత వ్యాధి అన్నారు నాలుగు నెలల వయసు పైబడిన పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

వాహనాల తనిఖీ

వీరబల్లి : వీరబల్లి- రాయచోటి మార్గంలోని కస్తూర్బా పాఠశాల వద్ద గురువారం స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వారికి జరిమానా విధించారు.

తవ్వారు.. వదిలేశారు!



కొత్తపేట వీధిలో రోడ్డపై గోతులు



మసీదు వీధిలో అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డు

- ప్రమాదాలకు నిలయాలు గోతులు
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

గుర్రంకొండ: పట్టణంలోని పలు వీధుల్లో పంచాయతీ సిబ్బంది పైపులైన్ల నిర్మాణం కోసం పలు చోట్ల పెద్దగోతులు తవ్వారు. నిర్మాణ పనులు పూర్తి అయినా తర్వాత గోతులు పూడ్చకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వీధుల్లో నిత్యం వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ గోతులను అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కొత్తపేట ప్రాంతం పరిధిలోని ఎస్ఎల్‌టీ వీధి, మసీదు వీధుల్లో సీసీ రోడ్లు గోతుల మయంగా మారాయి. శ్రీ పోలేరమ్మ వీధిలో నెల రోజుల కిందట సీసీ రోడ్డును తవ్వారు. కోట దగ్గర తాగునీటి సరఫరాకు ఆటకం ఏర్పడడంతో కొత్తపేట పైపులైన్‌ను రెండు భాగాలు విడదీసి గేట్‌వాల్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గోతులు తవ్వారు. ఇదేవీధిలో మూడు చోట్ల తవ్వారు. అయితే పనులు పూర్తి చేసినా గోతులు అలాగే దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇదే మార్గంలో చిన్న పిల్లలను పాఠశాలలకు తరలించే ఆటోలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గోతులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు గోతులు కనిపించక ప్రమాదాలకు గురయ్యారు.

తాగునీరు కలుషితం

స్థానిక కేపీ ఫంక్షన్ హాల్ పక్కనున్న వీధి ప్రారంభంలో ఉన్న రోడ్డు గేట్‌వాల్ కోసం తవ్వారు. పనులు సక్రమంగా పూర్తి చేయకపోవడంతో గోతులు అలాగే ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది తాగునీరు సరఫరా సమయాల్లో గేట్‌వాల్వ్ దగ్గర లీకేజీలు ఏర్పడి నీరు మొత్తం వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో తాగునీరు కలుషితమవుతోందని మహిళలు ఆరోపిస్తున్నారు. అలాగే ఎస్ఎల్‌టీ వీధి, పక్కనున్న మసీదు వీధి, నబీ కాలనీతోపాటు కొత్తపేట పరిసరాల్లో పలు వీధుల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. వీధుల్లో రోడ్లపై కంకర తేలిపోయింది. దీంతో రోడ్లు మొత్తం శిథిలమైపోయింది. శ్రీ పోలేరమ్మవీధిలో గతంలో నిర్మించిన మురుగునీటి కాలువలు దెబ్బతిన్నాయి. మురుగునీటి కాలువలు పూర్తిగా దెబ్బతిని రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో కొత్తపేట, ఎస్ఎల్‌టీ వీధి, శ్రీపోలేరమ్మ వీధుల్లో ఏర్పడ్డ గోతులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. సీసీరోడ్లు, మురుగునీటి కాలువలు, గోతుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. అనుమతి రాగానే పనులు చేపడతాం.

–శ్రీహరి, పంచాయతీ ఈఈ, గుర్రంకొండ

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

తంబళ్లపల్లె: ప్రతీ విద్యార్థి కష్ట పడి ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని బలకవారిపల్లె ఉన్నత పాఠశాలలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అజాద్ స్కౌట్ ట్రూప్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణ, సేవాభావం, ధైర్యసాహసాలు అలవర్చుకోవాలని సూచించారు. భగత్‌సింగ్, అజాద్ వంటి యువ నాయకుల చరిత్ర తెలుసుకుని వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సేవా కార్యక్రమాలతో మంచి గుర్తింపు పొంది ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఆశయంతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ స్కౌట్స్ యూనిట్‌ను ప్రారంభించాలని జిల్లా స్కౌట్స్ అధికారులను కోరారు. స్టేట్ స్కౌట్స్ శిక్షణ అధికారి ఉమాపతి, హెచ్‌డబ్ల్యూబీవీ ఇమామ్‌సాహెబ్ విద్యార్థులను స్కౌట్స్ యూనిట్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌బాబు, జిల్లా ఏఎస్ఓసీ లక్ష్మీకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక, ఉద్యోగ సమస్యలపై చర్చించాలి



మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, కార్మిక, ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి, వేతనాలు పెంచాలని, ఉద్యోగులకు కార్మికులకు బకాయి ఉన్న డీఏ అలవెన్సులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం చెల్లింపునకు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చర్యలను నిలిపివేయాలని కోరారు. మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నడపాలన్నారు. వీటి ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ఈనెల 22న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మదనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం చేయడంలో కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారించాలని ఎన్నిసార్లు కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మాధవ్, నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా సమితి సభ్యులు దేవా, చలపతి నాయుడు, జానకి, గంగులప్ప, మస్తాన్, రాధ, మాధవి పాల్గొన్నారు.

‘చలో మెడికల్ కళాశాల’ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నరేష్

కలికిరి(వాల్మీకిపురం): ‘చలో మెడికల్ కళాశాల’ జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ చింతల రామచంద్రారెడ్డి కోరారు. జిల్లాలోని మదనపల్లి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు నిరసనగా శుక్రవారం ఆరోగ్యవరం మెడికల్ కళాశాల ఆవరణలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియచేయడంలో భాగంగా శాంతియుత నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య విద్యకు దూరం చేస్తున్న ‘కూటమి’

కలికిరి: కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నరేష్ అన్నారు. కలికిరిలో స్థానిక విద్యార్థి సంఘం నాయకులతో కలిసి మాట్లాడుతూ వైద్య విద్యను పేదలకు చేరువ చేయడానికి మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను నెలకొల్పారని, అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకున్నపాపాన పోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. యుగంధర్, శామ్యూల్, ఫయాజ్,భానుప్రకాష్,జాకీర్,గిరిధర్ పాల్గొన్నారు.

వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలి



నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

కలికిరి: వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలని వీఆర్ఏ సంఘం నాయకులు కోరారు. వీఆర్ఏల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వీఆర్ఏల సంఘం పిలుపు మేరకు మండలంలోని వీఆర్ఏలు విధులు బహిష్కరించి గురువారం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వీఆర్ఏలకు పే స్కేలు అమలు, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు, నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్లతో శుక్రవారం కూడా నిరసన తెలియచేయడం జరుగుతుందని, శనివారం మదనపల్లి సబ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు వీఆర్ఏలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల గౌరవాధ్యక్షుడు రెడ్డెప్ప, అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి మల్లికార్జున, వీఆర్ఏలు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిమ్మనపల్లె : మండలస్థాయి స్కూల్‌గేమ్స్‌లో భాగంగా గురువారం జరిగిన పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోటీలు రెండోరోజు కొనసాగాయి. అథ్లెటిక్స్ విభాగంలో సీనియర్ బాలుర 100 మీటర్ల పోటీలో నిమ్మనపల్లె విద్యార్థి ఎస్.సంతోష్, బాలినాయునిపల్లె విద్యార్థి దినేష్ మొదటి, రెండో స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలికల సీనియర్ 100 మీటర్ల విభాగంలో నిమ్మనపల్లె హైస్కూల్‌కు చెందిన ఎం.రెడ్డిరాణి, పి.రాజేశ్వరి, అదేవిధంగా బాలుర సీనియర్ 200 మీటర్ల విభాగంలో సంతోష్, దినేష్ మొదటి, రెండోస్థానాలు పొందారు. సీనియర్ బాలికల షాట్‌పుట్ పోటీల్లో నిమ్మనపల్లెకు చెందిన ఎస్.రచన మొదటిస్థానం, కొమ్మిరెడ్డిగారిపల్లె హైస్కూల్ ఆర్.మాధురి రెండోస్థానం పొందారు. జూనియర్ బాలుర 200 మీటర్ల విభాగంలో కేశవరెడ్డి స్కూల్‌కు చెందిన పూర్ణప్రణబ్ మొదటిస్థానం, ఎస్.జయసింహ ద్వితీయస్థానం పొందారు. బాలికల జూనియర్స్ లాంగ్‌జంప్ విభాగంలో నిమ్మనపల్లె విద్యార్థి మిత్ర మొదటిస్థానం, హర్షిత రెండోస్థానం, సీనియర్ బాలికల విభాగంలో కె.రాజేశ్వరి, ఆర్.మాధురి మొదటి,రెండు స్థానాలు కై వసం చేసుకున్నారు. క్రీడాపోటీలను శ్రీనివాసులు, శారద పర్యవేక్షించారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ

రామసముద్రం: మండలంలోని చెంబకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ-2 ఆంజనేయులు తెలిపారు. కబడ్డీ పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో చెంబకూరు విద్యార్థులు ప్రథమ, కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో కేసీపల్లి ప్రథమ, అరికెల పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారు. ఖోఖో పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో మట్లవారిపల్లి ప్రథమ, చెంబకూరు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో మట్లవారిపల్లి ప్రథమ, కేసీపల్లి ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే వాలీబాల్ పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో అరికెల ప్రథమ స్థానం, మోడల్ స్కూల్ ద్వితీయ స్థానం, బాలురు విభాగంలో మోడల్ స్కూల్ ప్రథమ, చెంబకూరు ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. వీరికి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కే.మహేంద్ర

నిమ్మనపల్లె : మండలంలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల్లో పట్టుబడి నిల్వ ఉన్న వాహనాలను పరిశీలించారు. పోలీస్‌సిబ్బంది హాజరు, స్టేషన్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు గొడవలకు పాల్పడకుండా ఉంటే, పరిశీలించి షీట్ ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాకాకుండా అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వాములయితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీస్‌సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలన్నారు. ప్రజల్లో నమ్మకం కలిగేలా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో శాంతిభద్రతలపై పరిరక్షణకై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ తిప్పేస్వామి, ఏఎస్ఐ జిలానీబాషా, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి



చెత్తను సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గఫూర్

రామసముద్రం: స్వామిత్వ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గఫూర్ సూచించారు. గురువారం రామసముద్రంలో స్వామిత్వ సర్వే, చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటా చెత్త సేకరించి అందులో పొడి, తడి. చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. అలాగే స్వామిత్వ సర్వే నిర్లక్ష్యం చేయకుండా అందరూ బాధ్యతగా తీసుకొవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునస్వామి నాయక్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ



చెత్తసేకరణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్

కలకడ : కలకడ సచివాలయం పరిధిలోని చెత్త సేకరణ కేంద్రంలో శనివారం సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. శిక్షణలో రాయచోటి డివిజన్‌లోని 10 మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, రీసెర్స్ పర్సన్లు పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం చెత్త సేకరణ కేంద్రాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో కలకడ పంచాయతీ మండలంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట ఎరువుల తయారీ, వినియోగం, మొలకెత్తు విధానంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే వారికి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆదర్శంగా నిలిచిన కలకడ సర్పంచ్ ఫార్యీజాన్‌ను ఎంపీడీఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో జావేద్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శి పాల్గొన్నారు.

బార్లకు లైసెన్సులు కేటాయింపు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ఐదు బార్లకు లక్కీడిప్ విధానంలో లైసెన్సులు కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణానికి ఐదు బార్లు మంజూరు కాగా, వాటిలో నాలుగింటికి ఇదివరకే జిల్లా కలెక్టర్ లక్కీడిప్ ద్వారా కేటాయించారన్నారు. మిగిలిన ఒక బార్‌కు గురువారం రాయచోటిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో లక్కీడిప్ నిర్వహించారని చలపతినాయుడుకు లైసెన్స్ మంజూరైందని తెలిపారు.

విభిన్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

కురబలకోట: సవాళ్లు ఎదురైనప్పుడు మానవ మేధస్సు శక్తివంతంగా పనిచేస్తుందని విద్యార్థులు సృజనతో ఆలోచించి నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తు నిర్మాణం చేసుకోవాలని అంగళ్లలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రప్రథమ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. ఏబీసీటీఈ స్మార్ట్ ఇండియా ఇంటర్నేషనల్ హ్యాక్‌థాన్ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కొన్ని ఆవిష్కరణలు సమాజాన్ని మారుస్తాయన్నారు. మరికొన్ని సృజనాత్మక ఆలోచనలు కోట్ల మందికి ప్రయోజనకరంగా మారుతాయన్నారు. నేటి ఆలోచనలే రేపటి ప్రగతికి దారితీయిస్తాయన్నారు.

సరికొత్త జీవన విధానానికి మార్గదర్శనం చేస్తుందన్నారు. సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి సరైన ఆవిష్కరణలు తీసుకురావాలని పేర్కొన్నారు. సృజనాత్మక ఆలోచనలతో మనిషి భవిష్యత్తే కాదు సమాజంలో మార్పుకు కొత్తదారులు తెరుస్తుందన్నారు. సమస్యలను ఎదుర్కొనే నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. టెక్నాలజీ, ఆవిష్కరణ, సమస్య పరిష్కారాలు కలయికగా ఈ హాకథాన్ విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలికిరి: సోషల్ మీడియా పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ అనీల్ కుమార్ అన్నారు. కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, బెట్టింగ్, జూదం, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్‌తో జీవితాలు అంధకారమవుతాయన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సులభతర ఆదాయంపై ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఓపెన్ చేయకూడదన్నారు. విద్యపై దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశలను అనుగుణంగా చదవాలని సూచించారు. కష్టపడి చదవి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రధనుస్సు.. సొగసు చూడతరమా

నీల ఆకాశంలో ఎన్నో వింతలు చోటుచేసుకుంటున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే.. చిరుజల్లులకు సూర్యకిరణాలు తోడైతే సప్తవర్ణ మిళితమైన ఇంద్రధనుస్సు ఆకాశంలో ఆవిర్భవిస్తుంది. ఆకాశంలో అరుదుగా కనిపించే ఈ అద్భుత దృశ్యం గురువారం సాయంత్రం మదనపల్లె పట్టణంలో తన సొగసు చూడ తరమా అన్నట్టు సుమారు గంటపాటు చూపరులను అలరించి ఆకట్టుకుంది.

–మదనపల్లె సిటీ



సంపూర్ణ పోషణతోనే ఆరోగ్య రక్షణ



కురబలకోట: మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత



ములకలచెరువు: పోషణ మహోత్సవం కార్యక్రమంలో సీడీపీఓ భాగ్యమ్మ



పెద్దతిప్పసముద్రం: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కురబలకోట: సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యానికి రక్షణ అని తంబళ్లపల్లి సీడీపీఓ సుజాత అన్నారు. గురువారం పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీలలో పోషణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కురబలకోటలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ,కిశోర బాలికలకు, చిన్నారులకు సమతుల ఆహారం ఇవ్వాలన్నారు. రక్తహీనత నివారణ, ఊబకాయం నియంత్రణపై వైద్య నిపుణుల సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు, పాలు, ప్రొటీన్స్, ఫైబర్, విటమిన్స్, ఉన్న ఆహారపదార్థాలను తీసుకోవాలని సూచించారు. చాలా మంది మహిళలు కుటుంబ సభ్యులు భోజనం చేసిన తర్వాతనే భోజనం చేస్తారని, ఇది సరైంది కాదన్నారు. మహిళలు ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే కుటుంబ సభ్యులందరూ ఒకేసారి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

పెద్దతిప్పసముద్రం: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పులికల్లులో ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణీలు, బాలింతలతో సమావేశమై ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల్లి తీసుకునే ఆహారాన్ని బట్టి తల్లిపాలలో పోషకాలు పెరుగుతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరళ, లక్ష్మీదేవి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ములకలచెరువు: బాలింతలు, గర్భిణులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికే పోషణ మహోత్సవం కార్యక్రమం చేపట్టినట్లు సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. గురువారం మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే నెల 16 వరకు ఈ కార్యక్రమం ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నిర్వహిస్తున్నట్లు, బాలింతలు, గర్భిణులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.